క్లుప్తంగా

విరాళం



నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలంనాటి అతి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈసందర్భంగా ఖిలాషాపూర్ వాస్తవ్యులు హనుమకొండలో స్థిరపడిన పొన్నాల వంశీకృష్ణ ఆలయ అభివృద్ధికి రూ. 51,116 విరాళంగా కమిటీకి శుక్రవారం అందజేశారు. అనంతరం కమిటీ గౌరవ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు జంగిటి అంజయ్య, సభ్యులు రంగరాజు వెంకట రమణారావు, దేవుల పల్లి భాగ్యలక్ష్మి, ప్రజ్ఞాపురం శ్రీధర్, కొండ బాలయ్య శాలువాతో దాతను సత్కరించారు.

తీజ్ బతుకమ్మల నిమజ్జనం



దేవరుప్పుల: గిరిజన తండాల్లో యువతులు ఏటా తీజ్ బతుకమ్మ ఆడి పంటల సాగు, బాగు కోసం దేవతామూర్తులను కొలిచే క్రమంలో శుక్రవారం రాత్రి పెద్దతండాలోని మొగిలిచెరువులో పెద్దల సమక్షంలో తీజ్ బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కోర్యానాయక్, మాజీ ఎంపీటీసీ ఆశాజ్యోతి మాట్లాడుతూ నేటికి గిరిజన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తున్న యువతులను అభినందించారు. కార్యక్రమంలో చంద్రబాను, వసుంధర్,భాషా, చిన్న, అంబాలీ, బోంది, ముత్యాలమ్మ, కమిలి, సాల్కు, విజయ, పద్మ, నీల, విమల, మంజుల పాల్గొన్నారు.

సీఐగా వేణు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుతం ఘన్‌పూర్ సీఐగా పనిచేస్తున్న ముస్క రాజు బదిలీ కాగా నూతన సీఐగా జి.వేణు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఘన్‌పూర్ సీఐ రాజు హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్తుండగా ములుగు జిల్లా ఎస్‌బీ నుంచి వేణు ఘన్‌పూర్ సీఐగా వస్తున్నారు. ఈ మేరకు సీఐ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

బాధ్యతల స్వీకరణ

జఫర్‌గఢ్: స్థానిక ఎస్సైగా బానోత్ రామ్‌చరణ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాగా, బీజేపీ నాయకులు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

పాలకుర్తి తహసీల్దార్..

పాలకుర్తి: మండల తహసీల్దార్‌గా పి. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

పాము కరిచిందా.. చింతవద్దు



రఘునాథపల్లి: పాము కరిచిందా.. వెంటనే ఆసుపత్రికి వెళ్లండి. సకాలంలో బాధితులను తీసుకొస్తే ప్రాణాపాయం ఉండదని మండల వైద్యాధికారి డాక్టర్ కమల్‌హాసన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన వ్యక్తి పాము కాటుతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు వెంటనే స్పందించి వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మాట్లాడుతూ గత రెండు నెలల్లో రఘునాథపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏడుగురు పాము కాటు బాధితులకు చికిత్స అందించి కాపాడామన్నారు. వ్యవసాయం, ఇతర పనుల కోసం బయటకు వెళ్లినప్పుడు పాము కాటుకు గురైతే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకరావాలని సూచించారు. పాము కాటుకు గురైన వారికి అవసరమగు మందులు, ఇంజక్షన్లు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, సిబ్బంది ఆయోధ్య ఉన్నారు.

గుండెపోటుతో పూజారి శ్రీనివాసశర్మ మృతి



శ్రీనివాసశర్మ (ఫైల్)

దేవరుప్పుల: మండలంలోని పెద్దమదూరుకు చెందిన శివాలయ ఆలయపూజారి మోటకొండూరు శ్రీనివాసశర్మ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో గ్రామీణ వైద్యుడిగా విస్తృత సేవలందిస్తూ పూజారిగా స్థానిక, పరిసరాల గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన కోసం పాటుపడిన శ్రీనివాసశర్మ అకాల మరణం పలువురికి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన మృతి పట్ల బ్రాహ్మణ సంఘం మండల ప్రతినిధులు ఉప్పల సురేష్‌బాబు, రమేష్‌శర్మ, పెద్దాపురం వెంకటేశ్వరశర్మ, గిరిప్రసాద్, శ్రీ భక్తరామదాసు భజనమండలి రాష్ట్ర అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్, గ్రామస్తులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పిచ్చి మొక్కల మధ్య మోడల్ మార్కెట్

- రాత్రి, వగలు తేడా లేకుండా అసాంఘిక కార్యకలాపాలు

జనగామ: జిల్లా కేంద్రం సంజయ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేసిన మార్కెట్ భవనాన్ని పిచ్చి మొక్కలకు వదిలేశారు. మద్యం ప్రియులకు అడ్డాగా మారిపోయింది. ఖాళీ మద్యం సీసాలు, వాడి పారేసిన ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాల వేస్టేజ్‌తో ప్రారంభానికి నోచుకోని నూతన భవనం కంపుకొడుతోంది. సాయంత్రం మోడల్ మార్కెట్ దాటుకుంటూ వెళ్లాలంటే ఆయా కాలనీల ప్రజలు వణికిపోతున్నారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం గదుల షెట్టర్లకు తాళాలు వేసి, సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయ పడుతున్నారు.



మోడల్ మార్కెట్‌లోని పిచ్చి మొక్కలు

మార్కెట్‌ను ప్రారంభించండి : అమ్మ ఫౌండేషన్

సంజయ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మోడల్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజు కోరారు. వారు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ అమ్మబావి వద్ద ఉన్న మార్కెట్ స్థలం ఇరుకుగా మారడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. నిధుల కొరతతో పనులు మధ్యలోనే ఆగి పోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందన్నారు. మోడల్ మార్కెట్ అందుబాటులోకి వస్తే రైతులు పండించే కూరగాయలు హోల్‌సేల్‌గా అమ్ముకునేందుకు వెసులుబాటు ఉండడంతో పాటు పట్టణంలోని 30 వార్డుల ప్రజలకు ఇబ్బంది తప్పుతుందన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని, సరిపడా నిధులు విడుదల చేసి మార్కెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వారి వెంట అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు లకన్‌సింగ్, చందు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

'కుల బహిష్కరణ ఆరోపణ అవాస్తవం'

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన గుర్రపు కుమార్‌ను తాము కుల బహిష్కరణ చేశామని అతడు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తమని గ్రామ మాదిగ కుల సంఘం పెద్ద మనుషులు గుర్రపు యాదగిరి, కంజర్ల యాదగిరి, మొలుగూరి కుమార్ తెలిపారు. విశ్వనాథపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని తమ సామాజిక వర్గానికి చెందిన గుర్రపు కుమార్ ఉద్దేశ్యపూర్వకంగా తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. తాము ఎవ్వరినీ కుల బహిష్కరణ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయమై పోలీసు అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ అనుమాండ్ల మల్లేశం, కుల పెద్దలు ఎల్లయ్య, సరోజన, బొందయ్య, నర్సమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, చంద్రయ్య, ఎల్లేష్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదిగ కుల పెద్దలు

పార్టీ బలోపేతంలో యువత భాగస్వామ్యం కీలకం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠత కాపాడుకునే దిశలో యువత భాగస్వామ్యం కీలకమని కాంగ్రెస్ కొడకండ్ల బ్లాక్, యువజన విభాగం పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ధరావత్ రాజేష్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండలం కేంద్రంలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ ఎన్నికల నిర్వహణ కోసం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కాసారపు ధర్మారెడ్డి,తోటకూరి పాండుకృష్ణ, ,ఎస్సీ,బీసీ,ఎస్టీ సెల్ అధ్యక్షులు నాగరాజు, గణేష్, సజ్జన్, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు గులాం రసూల్, మండల నాయకులు పులిగిల్ల వెంకన్న,ముసిగంపుల నరేష్, బోనగిరి యాకస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

'అధికారం కోల్పోయినా తీరు మారడం లేదు'

జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయి.. పార్లమెంట్ ఎలక్షన్లలో ప్రజలు గుండు సున్నా పెట్టినా బీఆర్‌ఎస్ నాయకుల తీరు మారడం లేదని మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం కోసం నాలుగురున్నర కోట్ల మంది ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి అధికారంలోకి తీసుకువచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యాక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు నియంతల మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పదేళ్ల గులాబీ పార్టీ అధికారంలో ఒక్క మహిళా మంత్రికి అవకాశం ఇవ్వని కేసీఆర్, కేటీఆర్ ఆడపడుచులకు అత్యున్నత స్థాయిలో గౌరవం ఇస్తున్న రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత, స్థాయి లేదన్నారు. వారి వెంట సీనియర్ నాయకులు చింతల మల్లేశం, తదితర నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న రాజారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: సీపీఐ పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలు చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యల్ని విస్మరిస్తుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, సీపీఐ మండల కమిటీ నూతన కన్వీనర్‌గా మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన సముద్రాల రాజును నియమించినట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా సముద్రాల రాజు మాట్లాడుతూ పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి సీపీఐ మండల కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు పి.సుగుణమ్మ, ఎండీ.యూనస్, రమేష్, నాగరాజు, యాదగిరి, అజయ్ పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి



చిల్పూరు: సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, అధికారులు

చిల్పూరు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషలాఫీసర్ మాధవిలత కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్ఛదనం కోసం మొక్కలు నాటించడం, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ బర్మావత్ శంకర్, ప్రత్యేకాధికారులు బుద్దే విక్రమ్, మూడిక అనేష్, ఈద రమేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అజీజ్‌పాషా, మంద రేణుక, కవిత, సీనా పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మనోహర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం- పచ్ఛదనంపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, నాయబ్ తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుకన్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలో గ్రామాలన్ని పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉండాలని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మధుసూధన్, ఎంపీఓ నర్సింగరావు, ఏపీఓ ప్రేమయ్య, ఘన్‌పూర్ ఈఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలి

జనగామ రూరల్: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. జనగామ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ సంపత్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, ఏపీఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని భాగస్వాములు కావాలని తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరిలు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించుకుని ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. డాక్టర్ హరికృష్ణ, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ భవాని, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఆశలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలతో పాటు మండల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ రఘురామకృష్ణ, ఇన్‌చార్జ్ ఏపీఓ బిక్షపతి, ఏపీఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


పట్టపగలే ఇంట్లో చోరీ



దుండగులు తెరిచిన బీరువా

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆమనగంటి చంద్రయ్య-రాజమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఉదయం 10 గంటలకు వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి ముందు డోర్ తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదు లేకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి నరేష్ తెలిపారు.


పాలకుర్తిలో..



బాధితురాలు ఉప్పలమ్మ

పాలకుర్తి టౌన్: ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళ ఇంట్లో దుండగులు శుక్రవారం చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఒంటరిగా ఇంట్లో ఉన్న ఎడవెల్లి ఉప్పలమ్మను గుర్తించిన మాస్కులు ధరించి వచ్చిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బంగారు గొలుసు, మెడలోని నల్లపూసల గొలుసు, రూ.70 వేల నగదు తీసుకుని ద్విచక్రవాహనంపై పారిపోయారు.

వైన్స్‌లో..



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రైల్వే గేట్ సమీపంలోని లక్ష్మి వైన్స్‌లో గుర్తు తెలియని దుండగులు షట్టర్ పైకి ఎత్తి మద్యం సీసాలు అపహరించిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు, వైన్‌షాపు యజమాని కథనం ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు వైన్స్ షట్టర్ పైకిలేపి లోనికివెళ్లి పది ఫుల్ బాటిల్‌తో పాటు, రెండు బీర్లు, అపహరించారు. నగదు ఏమీ లేక పోవడంతో రూ.22 వేల విలువగల మద్యం సీసాలను దొంగిలించారు. ఉదయం షాపు షట్టర్ తెరిచి ఉండటంతో స్థానికులు యజమానికి సమాచారమిచ్చారు. వెంటనే యజమాని షాపు వద్దకు చేరుకుని దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ విషయమై ఎస్సై డి.నరేష్‌ను వివరణ కోరగా వైన్స్‌షాపులో చోరీ జరిగినట్లు షాపు యజమాని ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



జఫర్‌గఢ్: మండలంలోని సూరారం గ్రామ శివారులో యాకయ్యకు చెందిన రైస్‌మిల్లులో అక్రమంగా డంప్ చేసిన 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బానోత్ రామ్‌చరణ్ తెలిపారు. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం రైస్ మిల్లులో అక్రమంగా డంప్ చేసినట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌తో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్టు

జనగామ రూరల్: మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన అంకం మణిదీప్ జూలై 31వ తేదీన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని ఎస్సై భరత్ దర్యాప్తు చేపట్టారు. కాగా, శుక్రవారం రైల్వేస్టేషన్ వద్ద వాహనాల తనిఖీలో జగిత్యాల జిల్లా కొండగట్టుకు చెందిన ఉప్పు రమణారెడ్డి పోలీసులను చూసిన పారిపోతుండగా ఎస్సై పట్టుకొని స్టేషన్ తరలించారు. రమణారెడ్డి వేములవాడ పోలీస్ స్టేషన్‌పరిధిలో బైక్‌ల దొంగతనాలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లినట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దేవరుప్పుల: ప్రమాదవశాత్తు తీవ్రగాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం ఎంజీఎం వరంగల్‌లో మృతి చెందినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. జూలై 22వ తేదీన సీతారాంపురం గ్రామానికి చెందిన బస్వ అంజయ్య వీధుల్లో నడుస్తూ లుంగి తట్టి కిందపడగా తలకు తీవ్రగాయలయ్యాయి, వెంటనే చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వివవరించారు.

బ్యాంకులో ఉద్యోగుల నియామకం

సాక్షి స్పందన

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బచ్చన్నపేట బ్రాంచ్‌లో 'సిబ్బంది లేక ఇబ్బంది' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈమేరకు అదనపు ఉద్యోగులను నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం బ్యాంక్ మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ ఇద్దరు ఉద్యోగులు విధుల్లో చేరారని తెలిపారు. మరో ఇద్దరు కూడా రానున్నట్లు తెలిపారు. దీంతో బ్యాంకులో ఖాతాదారులకు సేవ లందించడం సులువవుతుందన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

జనగామ రూరల్: లింగాలఘనపురం మండలంలోని కళ్లెం గ్రామ పరిధిలో పేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లకు వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ డీఈకి వినతి పత్రం అందజేశారు. రాపర్తి రాజు,విజేందర్, దేవదానం, శంకరయ్య, పరశురాములు, ఉమేష్, సుత్తానా పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయ బృందం

పాలకుర్తి టౌన్: పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో సీఎం సమావేశానికి శుక్రవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు తదితరులు ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలు



సాక్షి నెట్‌వర్క్: తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు మండలాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్లు, వైద్యులు అవగాహన కల్పించారు. పిల్లలకు తల్లిపాలు పట్టించడంతో తల్లులకు బ్రెస్ట్ కేన్సర్ దూరమవడంతో పాటు పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బీజేపీ మండల యువమోర్చా కమిటీ

రఘునాథపల్లి: బీజేపీ యువమోర్చా మండల కమిటీని పూర్తిస్థాయిలో నియమించినట్లు ఆ పార్టీ యువమోర్చా మండల అధ్యక్షుడు బోళ్ల రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. యువమోర్చా మండల ఉపాధ్యక్షులుగా మోర్తాల ప్రవీణ్, కట్ట రాజేష్, మంద శేఖర్, మేకల రాజు, ప్రధాన కార్యదర్శులుగా మచ్చ నిఖిల్, రామగోని రాకేష్, కార్యదర్శులు మొగిలి కార్తీక్, జెనిగల రాజ్ కుమార్, గుగులోతు సురేష్, అరూరి నరేష్, కోశాధికారి వంగాల కరుణాకర్, అధికార ప్రతినిధులు పిట్టల నవీన్, గుగులోతు గణేష్, కార్యవర్గ సభ్యులుగా చెవ్వ రమేష్, కొలిపాక శ్రీధర్, కురాకుల కనకరాజులను నియమించినట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం



స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/దేవరుప్పుల/బచ్చన్నపేట: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని పలువురు నాయకులు అన్నారు. ఈ మేరకు బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, దేవరుప్పుల మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ ఆధ్వర్యాన అంబేడ్కర్ విగ్రహం, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కనకం రమేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్‌మాదిగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దుగ్యాల శంకరయ్యను బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ నేతృత్వంలో నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో ఆయనను సత్కరించారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: చిల్పూరులో జామాయిల్ మొక్కలను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్య తీసుకోవాలని బాధిత రైతు ఏమాండ్ల బుచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు అనుమానితుల పేర్లతో పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి

జఫర్‌గఢ్: వర్షాలకు అధ్వానంగా మారిన స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రోడ్డుకు మరమ్మతు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వర్షాలకు దెబ్బతిన్న తిమ్మంపేట ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను శ్రమదానం చేసి పూడ్చారు. మండల ప్రవీణ్‌కుమార్, నరేంద్రచారి, మోడెం అరవింద్‌గౌడ్, గాదెపాక శ్రీను, రడపాక నరేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

బచ్చన్నపేట: సర్పంచ్‌ల రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చలో అసెంబ్లీకి మాజీ సర్పంచ్‌లు వెళ్లకుండా ఎస్సై కంకల సతీష్‌కుమార్ శుక్రవారం వారిని ముందస్తు అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, కోనేటి స్వామి, మధుప్రసాద్ ఉన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు సత్వరమే అందజేయాలని డిమాండ్‌తో మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో అసెంబ్లీ పిలుపు మేరకు కోలుకొండ, ధారావత్‌తండా మాజీ సర్పంచ్‌లు కూర్నాల రవి, గేమానాయక్‌లను శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టు చేసినట్టు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

సన్మానం

బచ్చన్నపేట: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా, ఎంపీఓగా పదవీ బాధ్యతలను చేపట్టిన మల్లికార్జున్‌ను కాంగ్రెస్ పార్టీనాయకులు శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, నాయకులు జంగిటి విద్యానాథ్, వేముల వెంకట్‌గౌడ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రిజర్వాయర్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు



పాలకుర్తి: రిజర్వాయర్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దొంగరి మహేందర్, చింత సృజన్, మండల అధ్యక్షుడు దుంపలి సంపత్, కమ్మగాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పాఠశాలల శాశ్వత దాత ముచ్చ శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను దాత శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శ్యాంసుందర్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

స్నేహితుడికి సాయం

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడేనికి చెందిన డి.శ్రీనివాస్ కేన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. కాగా, శ్రీనివాస్‌తో చదువుకున్న పదో తరగతి పూర్వమిత్రులు రూ.50వేల సాయం అందజేశారు.